ఆలయాభివృద్ధికి కృషి


పూజల్లో పాల్గొన్న మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్ క్రాంతినగర్ కాలనీలో నిర్మాణ దశలో ఉన్న కల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని కార్పొరేటర్ వంగ మధుసూధన్‌రెడ్డి అన్నారు. గురువారం స్వామివారి గర్భాలయ సింహద్వారం ఏర్పాటు కార్యక్రమానికి ఆయన హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వింజమూరి రామానుజాచార్యులు, స్థపతి శ్రీనివాసాచార్యులు, ఆలయ చైర్మన్ సత్యనారాయణగౌడ్, సభ్యులు ఆనంద్, దివాకర్, నాయకులు చంద్రారెడ్డి, దశరథగౌడ్ పాల్గొన్నారు.

జైళ్లశాఖ అధికారుల పనితీరు భేష్


ఆరోగ్య సమస్యలపై ఖైదీలతో మాట్లాడుతున్న శారద

చంచల్‌గూడ: తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖ పనితీరు బాగుందని రాష్ట్ర మహిళ కమిషన్ నేరెళ్ల శారద అన్నారు. గురువారం ఆమె చంచల్‌గూడ మహిళ జైలును సందర్శించి అడ్మిషన్ ప్రక్రియ, ములాఖత్ నిర్వహణ, ఆసుపత్రి, బ్యారక్‌లు, వర్క్‌షాప్, వంటశాలను పరిశీలించారు. జైల్లో ఖైదీలకు అందిస్తున్న స్వయం ఉపాధి శిక్షణ, ఆహారం, వైద్యం, విద్య తదితర విషయాల గురించి జైలు సూపరింటెండెంట్ వెంకటలక్ష్మీ వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్షణికావేశంలో వచ్చిన ఖైదీలు మానసికంగా బాధపడకుండా అధికారులు కృషి చేస్తున్నారన్నారు. మళ్లీ సమాజంలోకి తిరిగి వెళ్లి గౌరవంగా బతికే విధంగా వివిధ రకాల శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం కావాలన్న మహిళ కమిషన్ సిద్ధంగా ఉందన్నారు.

తెలుగు సాహితీ సంబరాలకు ఆహ్వానం


పల్లె మస్తాన్ కశ్యప్

హయత్‌నగర్: ఏపీలోని ఏలూరులో మే 10,11 తేదీలలో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో జరిగే ప్రపంచ తెలుగు సాహితీ సంబరాల్లో పాల్గొనేందుకు హయత్‌నగర్‌కు చెందిన మల్లె మస్తాన్ కశ్యప్‌కు ఆహ్వానం అందింది,. మస్తాన్ కశ్యప్ సాహిత్యం, సినిమా, సేవా రంగాలలో పనిచేస్తూ గుర్తింపు పొంది పలు అవార్డులను అందుకున్నారు.

రేషన్ కార్డుల దరఖాస్తుల పరిశీలన


దరఖాస్తులు పరిశీలిస్తున్న అధికారులు

చాదర్‌ఘాట్: మలక్‌పేట సర్కిల్–1 పరిధిలో కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులను అధికారులు పరిశీలిస్తున్నారు. సంక్షేమ పథకాలకు కచ్చితంగా తెల్ల రేషన్ కార్డు కావాల్సి ఉండటంతో చాలా మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో అర్హులైన వారికి మాత్రమే రేషన్ కార్డులు మంజూరు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మలక్‌పేట డివిజన్ పరిధి 7 డివిజన్లలో గురువారం ఏఎస్‌ఓ, సిబ్బంది దరఖాస్తులు పరిశీలించారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

మన్సూరాబాద్: ఆటోనగర్‌లోని వాటర్ ట్యాంక్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం మేడే పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి హాజరై మాట్లాడుతూ.. నాటి అమరవీరుల స్ఫూర్తిని నిలబడుదామని, లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలు, ప్రజాప్రయోజనాలు నెరవేరకుండా కార్పొరేట్ వర్గాలకు పాలకవర్గాలు ఊడిగం చేస్తున్నాయన్నారు. ఎనిమిది గంటల పనిదినం చేయాలని కార్మికవర్గం సంఘటితంగా పోరాటాలు చేసి సాధించిన స్ఫూర్తితో మేడే వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణయ్య, నర్సిరెడ్డి, వెంకటమ్మ, శ్రీదేవి, సింగ్ పాల్గొన్నారు.

దేవాలయాలా.. వ్యాపార సముదాయాలా?

- ఆలయ ప్రాంగణాల్లో కమర్షియల్ నిర్మాణాలు
- పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు
- ఇబ్బందులు పడుతున్న భక్తులు

వనస్థలిపురం: దేవాలయాలు ఆధ్యాత్మికత, ప్రశాంతతకు నిలయాలు. ఆయా దేవాలయాలకు నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. అలాంటి దేవాలయాలు నేడు భక్తులకు సౌకర్యాలు కల్పించడం మానేసి ధనార్జన బాట పట్టాయి. ఆయా ఆలయాల పాలవర్గాలు ఆదాయం కోసం దేవాలయాలను వ్యాపార సముదాయాలుగా మార్చేస్తున్నాయి. నిర్వహణ ఖర్చులో.. అధిక డబ్బులు వస్తాయనో దేవాలయం ప్రాంగణాలలో కమర్షియల్ నిర్మాణాలు చేపడుతు, వాటిని అద్దెకిస్తూ లాభాపేక్షతో వ్యవహరిస్తున్నాయి. దీంతో ఆయా దేవాలయాలలో స్థలం కుంచించుకుపోతూ అక్కడికి వచ్చే భక్తుల ఇబ్బందులకు గురవుతున్నామని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వనస్థలిపురంలో...

వనస్థలిపురంలో పేరొందిన శ్రీ లక్ష్మీగణపతి దేవాలయం, సచివాలయనగర్‌లో శ్రీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం, వనస్థలిహిల్స్‌లో శ్రీ రామాలయం, ప్రశాంత్‌నగర్‌లో శ్రీ కనకదుర్గ దేవాలయం, సాహెబ్‌నగర్ మర్రి చెట్ల సమీపంలో శ్రీ ఉమా రామలింగేశ్వరస్వామి దేవాలయం ఉన్నాయి. కాగా ఈ దేవాలయాల ప్రాంగణాలలో గత కొన్నేళ్లుగా యథేచ్ఛగా కమర్షియల్ నిర్మాణాలు జరుగుతున్నాయి. దీంతో అక్కడికి వచ్చే భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఆలయ ప్రాంగణాలలో ప్రధాన రోడ్లవైపు షాపులను నిర్మించి అద్దెకు ఇస్తుండడంతో ట్రాఫిక్ సమస్యలూ తలెత్తుతున్నాయి.



వనస్థలిపురంలో శ్రీ లక్ష్మీగణపతి దేవాలయ ప్రాంగణంలో ప్రధానరోడ్డులో నిర్మించిన షాపులు

టౌన్ ప్లానింగ్ అధికారుల మౌనం..

ఎన్నో సంవత్సరాల క్రితం నిర్మించిన దేవాలయాలలో ఇటీవల యథేచ్ఛగా కమర్షియల్ నిర్మాణాలు జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారుల మౌనానికి అర్థం ఏంటోనని స్థానికులు, భక్తులు చర్చించుకుంటున్నారు. ఆయా దేవాలయాల ప్రాంగణంలో ఖాళీ స్థలంలో బహుళ అంతస్తుల నిర్మాణాలు జరుగుతున్నా వారికి ఎందుకు కనిపించడం లేదని వారు పేర్కొంటున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారుల బాధ్యతారాహిత్యం వల్లనే దేవాలయాల వద్ద కమర్షియల్ నిర్మాణాలు జరుగుతున్నాయని, దీని వల్ల ఆయా రహదారుల్లో ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయని ట్రాఫిక్ సిబ్బంది ఆరోపిస్తున్నారు.

మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

దేవాలయాల వద్ద నిర్మాణాలు, రోడ్డు ఆక్రమణలతో వనస్థలిపురంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్న విషయం నిజమే. ఈ విషయాన్ని స్థానిక కార్పొరేటర్‌తో పాటు, జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం . అందరి సహకారంతో స్పెషల్ డ్రైవ్ చేపట్టి అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలను తొలగిస్తేనే ట్రాఫిక్ ఇబ్బందులు తొలగుతాయి.

బి.గట్టుమల్లు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్


సచివాలయనగర్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలో..



రామాలయం ప్రాంగణంలో ప్రధాన రహదారి వైపు నిర్మించిన షాపులు


ఉమా రామలింగేశ్వరస్వామి దేవాలయం ముందు నిర్మించిన కమర్షియల్ షటర్లు

రాజీవ్ యువ వికాసంతో దివ్యాంగులకు లబ్ధి


ముత్తినేని వీరయ్య

చాదర్‌ఘాట్: రాజీవ్ యువ వికాసం ద్వారా రాష్ట్రంలోని 25000 మంది దివ్యాంగులకు లబ్ధి చేకూరనున్నట్లు రాష్ట్ర టీవీసీసీ చైర్మన్ ముత్తినేని వీరయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాల వారీగా దివ్యాంగుల కోసం జిల్లా, మండల కమిటీలు ఏర్పాటు చేసి దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కార్యాలయానికి నేరుగా వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం కార్పొరేషన్‌ల ద్వారా (ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ) ఎంపిక చేస్తారన్నారు. త్వరలో జిల్లాల్లో పర్యటించి కార్పొరేషన్ స్థలాలు, ప్రొడక్షన్ సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబుకు ఆహ్వానం

అబిడ్స్: ఈ నెల 30న యాదవ అహీర్ జమాజ్ ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించే సామూహిక వివాహాల్లో పాల్గొనాలని ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ కో ఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం మంత్రి శ్రీధర్‌బాబుకు ఆయన ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ సందర్భంగా నిర్మల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ..ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం కూడా ఈ నెల 30న యాదవ సమాజానికి చెందిన పలువురు జంటలకు ఉచితంగా వివాహాలు జరిపించి వారికి అన్నివిధాల సహకారం అందిస్తున్నట్లు వివరించారు. మంత్రి శ్రీధర్‌బాబు సానుకూలంగా స్పందించి సామూహిక వివాహాలకు వచ్చేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

ప్రత్యేక పూజలు


ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

చంపాపేట: చంపాపేట డివిజన్ దుర్గానగర్ కాలనీలోని శ్రీపోచమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సుధీర్‌రెడ్డిని వేద మంత్రోశ్చరణలతో ఆశీర్వదించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు చీర శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, రవిముదిరాజ్, కృష్ణమాచారి, రాజిరెడ్డి, సదానంద్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు శ్రీశైలం, గణేష్ పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు తరలివారలి

హస్తినాపురం: బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు భారీగా తరలిరావాలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం నందనవంకాలనీలో నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ నెల 27 వరంగల్ జరిగే సభకు నియోజకర్గం నుంచి పెద్దఎత్తున తరలివెళ్లేలా ప్రతి కార్యకర్త సైనికునిడిలా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, పద్మానాయక్, సత్యంచారి, ఆదిలక్ష్మీ పాల్గొన్నారు.

రోహింగ్యాల అక్రమ వలసలను అరికట్టాలి

బాలాపూర్ తహసీల్దార్‌కు బీజేపీ నాయకుల వినతి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌లో తలదాచుకున్న రోహింగ్యాలను ఏరిపారేసే చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ నాయకులు గురువారం బాలాపూర్ తహసీల్దార్ ఇందిరాదేవికి వినతి పత్రం సమర్పించారు. పార్టీ కార్పొరేషన్ సెక్టార్–1, 2 అధ్యక్షులు రాళ్లగూడం రామకృష్ణారెడ్డి, వీరకర్ణారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు తహసీల్దార్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాలాపూర్ ప్రాంతంలో రోహింగ్యాలు స్థిరపడిన ప్రాంతాల్లో మతపరమైన శిబిరాలు, మదర్సాలను అడ్డుపెట్టుకొని హిందువులను శంఖించదగిన కార్యకలాపాలు నిర్వహిస్తున్నారన్నారు. ఇది కేవలం అక్రమ వలస సమస్య కాదు దేశ, ప్రజల భద్రతకు ఉన్న ప్రత్యక్ష ముప్పు అని ఆరోపించారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో రోహింగ్యాలు అక్రమ వలసదారులుగా ఉంటూ జాతి భద్రతకు సవాల్ విసురుతున్నారన్నారు. ఇప్పుడు బోగస్ ఆధార్, ఓటర్ కార్డులు సిద్ధం చేసుకొని నిబంధలను అతిక్రమిస్తూ భారతపౌరులుగా వేశాలు వేసుకుంటూ చలామణి అవుతున్నారని పేర్కొన్నారు. అక్రమ వలసదారుల వెనక పెద్ద మాఫియా ఉందని, రెవెన్యూ, పోలీస్ శాఖలు జోక్యం చేసుకొని సర్వే నిర్వహించి అక్రమంగా పుట్టిన డాక్యుమెంట్లను రద్దుచేయాలని వినతిపత్రంలో డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కిసాన్ మోర్చా నాయకులు ఏనుగు రాంరెడ్డి, రేసు నర్సింహారెడ్డి, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్, రాజ్‌కుమార్, తిరుమలేశ్, మల్లెల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్ ఇందిరాదేవికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

మహేశ్వరం: కాలనీని శుభ్రంగా ఉంచడంలో కార్మికులు పడే శ్రమ వెలకట్టలేనిదని 19వ వార్డు మాజీ కౌన్సిలర్ పల్లపు శంకర్ అన్నారు. గురువారం జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరామ కాలనీలో ఆయన పారిశుద్ధ్య విభాగం సూపర్‌వైజర్ కుమార్‌తో పాటు కార్మికులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాలనీని శుభ్రంగా ఉంచడంలో కార్మికులు పడే శ్రమ వెలకట్టలేనిదని, వారి సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. కార్మికులకు వేతనాలు పెంచి, సకాలంలో అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కృష్ణ, భీమ్, మారుతీ తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల నివారణకు చర్యలు

బోడుప్పల్: నగర పాలక సంస్థ పరిధిలో రానున్న వర్షాకాలంలో ముంపు ప్రాంతాల నివారణకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ శైలజ అన్నారు. ముంపునకు గురయ్యే బచపన్ స్కూల్ సర్కిల్ నుంచి పీఎస్‌ఆర్ కాలనీ, బీఎల్‌నగర్, ఎస్‌బీఆర్ కాలనీ, అమ్మసాని కాలనీల్లో గురువారం ఆమె పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నూతన పైపులైన్ పనులు చేపట్టి జూన్ మొదటి వారంలోగా పూర్తి చేసి మురుగునీరు, వర్షపు నీటిని ప్రధాన కాల్వకు మళ్లిస్తామన్నారు. అలాగే ఈనెల 30 లోగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నులు (ఎర్లీబర్డ్ స్కీం) ద్వారా చెల్లించి రాయితీ పొందాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, ప్రతినిధులు పోగుల దిలీప్‌రెడ్డి, కె. శ్రీనివాస్‌రావు, వెంకటేశ్, శంకర్‌గౌడ్, సంజీవ్, జయప్రకాశ్ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌తో పాటు వివిధ అనుబంధ కాలేజీల్లో పని చేస్తున్న పార్టుటైం అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని గత మూడు రోజులుగా చేస్తున్న సమ్మెలో భాగంగా గురువారం దండోర మోగించారు. ఓయూ క్యాంపస్‌లో ఆర్ట్స్ కాలేజీ నుంచి వీసీ పాలన భవనం వరకు డప్పు వాయిద్యంతో నినాదాలు చేస్తూ కవాతు చేపట్టారు. పీజీ, పీహెచ్‌డీ, యూజీసీ నెట్ తదితర అర్హలతో పాటు రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో ఉద్యోగాలకు ఎంపికైన పార్ట్‌టైం అధ్యాపకులపై చిన్నచూపు తగదన్నారు. తక్కువ వేతనంలో పని చేస్తున్న పార్ట్ టైం అధ్యాపకులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అధ్యాపక ఉద్యోగాల నియామకానికి విడుదల చేసిన జీవో 21లో కనీసం వెయిటేజ్ ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ పార్ట్‌టైం టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డా.సోమేశ్వర్, కార్యదర్శి జానకి రెడ్డి, ఉపాధ్యక్షులు డా. ఎస్వీ రత్నం, డా.సుందర్, డా.యుగేందర్, డా.దుబ్బ రంజిత్, డా.వరలక్ష్మీ, డా.విష్ణు భూపతి, డా.శంకర్, డా.మధు, డా.కర్ణాకర్, డా.కవిత, డా.శ్రీదేవి, డా.సాగరిక తదితరులు పాల్గొన్నారు.

ఇష్టంతో చదివితే ఉజ్వల భవిష్యత్తు

చంపాపేట: ఇష్టంతో చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని విద్యావేత్త, విశ్రాంత ఉపాధ్యాయుడు లెక్కల కృష్ణారెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ శ్రీసరస్వతీ ఉన్నత పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన స్నాతకోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు జ్ఞాపికలను అందచేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ..విద్యార్థుల్లో పాఠ్యాంశాలపై ప్రశ్నించే తత్వాన్ని పెంపొందిచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యా సంవత్సరంలో మెరిట్ మార్కులు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ లలితారెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ ఉపాధ్యాయులు నర్సింహా, వినయ్, శివకుమార్, అవీనా, అనిత, గీతాంజలి పాల్గొన్నారు.



స్నాతకోత్సవ వేడుకలో పాల్గొన్న చిన్నారులతో లెక్కల కృష్ణారెడ్డి

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి


పనులు ప్రారంభిస్తున్న సుజాతానాయక్

హస్తినాపురం: రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు కనీస వసతులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. డివిజన్ పరిధిలో గురువారం ఆమె సీసీ రోడ్డు పనులను ప్రారంభించి మాట్లాడారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని, స్థానికులకు ఇబ్బందులు లేకుండా సకాలంలో పనులు పూర్తి చేయాలన్నారు. కార్పొరేటర్ వెంట శశిధర్‌రెడ్డి, బ్రహ్మారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రాజునాయక్, సాయిరాంరెడ్డి, శేఖర్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, బొద్దు శ్రీనివాస్, కరాటేరాము, మధు, అశుతోష్, మారుతి ఉన్నారు.

ఉపాధ్యాయుల కృషి అభినందనీయం

నాగోలు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని ఉప్పల్ మండల విద్యాధికారి రామారావు అన్నారు. నాగోలు డివిజన్ జైపురి కాలనీ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుల బత్తుల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాల మ్యాగజిన్ రూపొందించారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మ్యాగజిన్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ మండల పీఆర్‌టీయూ అధ్యక్షులు ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మైఖేల్‌రెడ్డి, ఉపాధ్యాయులు అనంత రెడ్డి, ప్రధానోపాధ్యాయులు శేఖర్, పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.


మ్యాగజిన్ విడుదల చేస్తున్న ఎంఈఓ రామారావు

ఉగ్రదాడులకు నిరసనగా..


అక్బర్‌బాగ్‌లో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బలాల

జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండిస్తూ గురువారం ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల్లో నిరసనలు కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించారు.మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల ఆధ్వర్యంలో నల్లగొండ క్రాస్ రోడ్ నుంచి మలక్‌పేట రైస్‌మిల్లర్స్ మీదుగా అక్బర్‌బాగ్ చౌరస్తా వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బీజేపీ కార్పొరేటర్ల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహిస్తూ ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

–ఎల్‌బీనగర్, మలక్‌పేట జోన్ల బృందం


వివేకానంద విగ్రహం వద్ద కొవ్వొత్తుల ర్యాలీలో మాట్లాడుతున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి


కొవ్వొత్తుల ర్యాలీ పాల్గొన్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి


హస్తినాపురం సెంట్రల్‌లో కొవ్వొత్తులు వెలిగించి మృతులకు నివాళి అర్పిస్తున్న జస్టిస్ చంద్రకుమార్


ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515
9912220363
9912220365